కథ

ఉత్తరాల పొత్తి - జ్ఞాపకాల గుత్తి
మారుతున్న మనుషుల ప్రవృత్తి - ఉత్తరాలకు తగ్గిపోయిన ప్రతిపత్తి !

పాత సామాన్ల కొట్టులో వినాయక చవితి పూజ 'పాలవెల్లి' కోసం వెతుకుతుండగా కన్పించిన ఉత్తరాల తీగను చేతుల్లోకి తీసుకుంటుంటే ఎప్పుడో చదివిన ఓ వచన కవితా పంక్తులు అప్రయత్నంగా నా నోటివెంట వెలువడ్డాయి.

'పాలవెల్లి' వెతుకులాటను తాత్కాలికంగా పక్కన పెట్టి ఆ తీగకున్న ఒక్కో ఉత్తరాన్ని చదువుకుంటూ కూర్చున్న నేను అలా... అలా ముప్పైఐదు, నలభై ఏళ్ళ వెనక్కి వెళ్ళిపోయాను.

# అడవి లోపల....




శిరంసెట్టి కాంతారావు

తీగ ఆఖరి కంటా వెళ్ళేసరికి చాలా ఉత్తరాలు జీర్ణమై ముట్టుకుంటేనే నుసి, నుసిగా రాలిపోతున్నాయి. అందుకే ఒక్కో ఉత్తరాన్ని అతి జాగ్రత్తగా తీసి చదువుతున్న నాకు దాదాపు నలభై ఏడేండ్ల క్రిందట మా తాతగారు బామ్మకు రాసిన ఉత్తరం ఒకటి నాలో తుఫాన్ లాంటి ఆసక్తిని రేకెత్తించింది.

అప్పట్లో మా తాతగారు ఖమ్మం జిల్లా ఇల్లందు ఏరియా ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేస్తుండేవారట. ఐతే మా బామ్మ మాత్రం మా నాన్న, మేనత్తల చదువుల కోసమని మా సొంత ఊరు సూర్యాపేటలోనే ఉండేదట.

ఆ రోజుల్లో ఫోన్లూ గట్రా లేకపోవడంతో ఏ విషయమైనా ఉత్తరాల ద్వారానే తెలిసేది.

ఇల్లందులో ఉద్యోగం రీత్యా ఉండే తాతయ్య సూర్యాపేటలో ఉండే బామ్మకి తప్పనిసరిగా వారానికో ఉత్తరం వ్రాసేవాడట.

ఆ ఉత్తరాల్లో తనెక్కడ క్యాంపుంది. ఏం చేస్తుంది. అడవుల్లో దౌరా తిరిగేటప్పుడు తను చూసిన వింతలు, విడ్డూరాలు కథలు, కథలుగా వ్రాసేవాడంట!

అలా తను వ్రాసిన ఉత్తరాల్లో ఓ ఉత్తరమే నన్నిప్పుడు ఇంతగా ఆకర్షించింది.

ఆ ఉత్తరాన్ని మళ్ళీ ఓసారి మనసులోనే చదువుకున్నాను.

ఇల్లందు.
15 - 09 - 1968.

శ్రీరస్తు చిరంజీవి లక్ష్మీ సౌభాగ్య వతి నర్సమ్మను ఆశీర్వదిస్తూ వ్రాయునది.

భగవంతుని దయవలన పిల్లలు, నీవూ క్షేమమని భావించుచున్నాను. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోగలవు.

ఈ మధ్య నేనిక్కడ కొమరారం అడవుల్లో దౌరా తిరుగుతున్నప్పుడు అక్కడున్న పాండవుల గుట్టలో ఇంతకుముందు నీకు చెప్పినట్లు ఆ మూడు రకాల చెట్లూ విపరీతంగా

కనిపించాయి, ఇలాంటిచోట మనం అనుకున్నట్టు ఆ రాళ్ళ మేకలను ఇక్కడి గిరిజనుల చేత కూడా పోషణ చేయించామనుకో నిజంగా వాళ్ళ బ్రతుకుల్లో చాలా గొప్ప మార్పులు సంభవిస్తాయనిపిస్తుంది.....

చిత్రంగా ఉన్న ఆ ఉత్తరాన్ని చదువుతున్న నా ఉత్సాహం మీద నీళ్ళు చిలకరించినట్టు ఆ ఉత్తరం మిగతా భాగం ఎక్కడో చినిగిపోయింది.

దాంతో "అసలా రాళ్ళమేకలంటే ఏంటి? తాతయ్య పేర్కొన్న ఆ మూడు రకాల చెట్లేంటి? పాండవుల గుట్టలేంటి? ఎక్కడున్నాయి ? ఆ గుట్టల మీద ఏవైనా పురాతన ఆలయాలు, శిల్పాలు, గుహలు ఉన్నాయా ? ఉంటే వాటి మీదేవైనా రాళ్ళతో చెక్కిన బొమ్మలున్నాయా? రాళ్ళ మేకలంటే అవేనా ? వాటివల్ల గిరిజనుల బతుకుల్లో వచ్చే మార్పులేమిటి?" నాలో సందేహాలు వెల్లువెత్తాయి.

చైనాలో వైద్య విద్యను ముగించుకుని మొన్న, మొన్ననే ఇంటికొచ్చిన నాలో ఈ రాళ్ళమేకల విషయం రగిలించిన ఆసక్తి అంతా, ఇంతా కాదు. ఎంతా అంటే? అప్పటికప్పుడు ఆ కొమరారం అడవులకు బయలుదేరాలనే నిర్ణయం తీసుకునేటంత.

నాకేదైనా ఓ కొత్త విషయం గురించి తెలిస్తే దాని అంతు తేల్చుకునేదాకా నిద్ర పట్టని గుణం మా తాతగారి నుండి నాకు సంక్రమించిందనేది మా అమ్మా, నాన్నల ప్రగాఢ విశ్వాసం.

'స్టోర్రూమ్' నుండి వెంటనే బయటకొచ్చిన నేను నాన్నతో ఆ రాళ్లమేకల గురించేమైనా తెలుసేమోనని అడిగాను.

ఐతే, తనింతవరకూ అసలలాంటి మాటే వినలేదని చెప్పడంతో నాలో మరింత ఆసక్తి పెరిగింది.

మరిప్పుడేం చెయ్యాలి? ఏం చెయ్యాలన్నా ఓసారా కొమరం అడవుల్లోకి వెళ్ళాల్సిందే.

"ఇన్నాళ్ళ తరువాత ఇంటికొచ్చిన వాడివి హాయిగా నాలుగు రోజులు ఇంటి పట్టునుండక మళ్ళీ ఇదేం పితలాటకంరా ! అడవులు పట్టుకుపోతానంటా వేంటి? ! అదసలే నక్సలైట్ ఏరియా కూడానూ" అంటూ అమ్మా, నాన్నలు ఎన్నిరకాలుగా అడ్డుపడ్డా నా నిర్ణయాన్ని మాత్రం మార్చలేకపోయారు.

✿ ✿ ✿

సూర్యాపేటలో నన్నెక్కించుకున్న బస్సు ఇల్లందులో దించి భద్రాచలం దిక్కుగా సాగిపోయింది.

ఇల్లందులో దిగిన నేను నాన్న ఇచ్చిన అడ్రస్ ప్రకారం సుభాష్‌నగర్‌లో ఉన్న ఆయన ఒకప్పటి మిత్రుడు శాంతారామ్ అంకుల్ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళేసరికి అదృష్టం కొద్దీ ఆయన ఇంటివద్దే ఉన్నాడు.

నన్ను నేనుపరిచయం చేసుకున్నాను.

స్వయంగా మా నాన్ననే చూసినంతగా ఆనందించిన తను ఆప్యాయంగా నన్ను గుండెలకు హత్తుకున్నాడు.

ఆ రాత్రి భోజనాలయ్యాక స్థిమితంగా కూర్చుని పిచ్చాపాటి మాట్లాడు కుంటున్న సమయంలో మెల్లగా నేను అసలు విషయంలోకొస్తూ రాళ్ళమేకల గురించి ప్రస్తావించాను.

"అరే మొదటినుండీ మాదీవూరే అయినప్పటికీ ఇప్పటిదాకా నేనసలా మాటే విన్నట్టు కూడా లేదే !" దీర్ఘంగా ఆలోచిస్తూ బదులిచ్చాడు శాంతారామ్ అంకుల్.

"పోన్లే అంకుల్ ! తెలియందానికి మీరేం చేస్తారుగాని ఇంకో సాయం చేస్తారా ?"

"ఏంటది?"

"ఈ ఊళ్ళో మీకు తెలిసిన యాదవులెవరైనా ఉన్నారా?"

"ఉంటే?"

"వాళ్ళ ద్వారా ప్రయత్నిస్తే ఏదైనా సమాచారం తెలుస్తుందేమోనని".

ఔను మరి. ఓ లక్ష్యం నిర్ధేశించుకున్న వ్యక్తి దాని సాధనలో ఏ మార్గమూ లేనిచోట తానే ఓ మార్గాన్ని సృష్టించుకోగలగాలి కదా ?

"ఆ తెలుసు.... నాతోపాటే కంపెనీలో పనిచేసి దిగిపోయిన పోల్రాజ్‌ది అదే కులం. వాళ్ళకు ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న నామాలపాడులో వ్యవసాయంతో పాటు గొర్రెలు, మేకలు కూడా ఉన్నాయి. నువ్వన్నట్టు అతనికేమైనా తెలిస్తే తెలిసుండొచ్చు. రేప్పొద్దున్నే వాళ్ళింటికెళ్ళి కనుక్కుందాంలే" అంటూనే ఇక నిద్రొస్తుందన్నట్టుగా లేచి నిల్చున్నాడు శాంతా రామ్ అంకుల్.

✿ ✿ ✿

"ఏమో సార్ ! మీరన్నట్టు ఆ కొమరారం, దండుగుండ అడవుల్లో రాళ్ళమేకలు పెంచుతారని అనంగ ఇనటమే గాని నాకైతే తెల్వది." మరునాడు ప్రొద్దున్నే శాంతారామ్ అంకుల్‌తో పాటు పోల్రాజ్ ఇంటికెళ్లి ఆరాతీస్తే అప్పటిదాకా ఆత్మీయంగా మాట్లాడినవాడు కాస్తా మా వంక అదోరకంగా చూస్తూ సమాధానం ఇచ్చాడు.

"పోనీ, ఎవరిని కలిస్తే విషయం తెలుస్తుందో అదన్నా చెప్పండి చాలు" అడిగాన్నేను.

ఎందుకోగాని, అందుక్కూడా చాలాసేపు వెనుకా, ముందు లాడిన పోల్రాజ్ "ఈణ్ణుంచి సక్కగ కొమరారం బొయ్యి, అక్కణ్ణుంచి ఓ పది, పన్నెండు మైళ్ళు కాలినడకన అడివిలోకి పోతే అక్కడ "కుందేలు గుంపు" అనే కోయగూడెం వస్తుంది. అక్కడికి పోతే ఏదన్న మతలబ్ దొరికితే దొరకొచ్చు." ఇక అంత కన్నా మాట్లాడేదేమీ లేదన్నట్టు కూర్చున్నవాడు కాస్తా బైటికి వెళ్ళాలన్నట్టు లేచి నిల్చున్నాడు.

ఇంక చేసేదేమీ లేక వెనుదిరిగాము.

"అసలా రాళ్ళమేకల గురించి తెలుసు కున్నందు వల్ల నీకొచ్చే లాభమేంటో నిజంగా నాకర్థం కావట్లేదోయ్ ! ఆ కోయోళ్ళతో వ్యవహారం కత్తిమీద సాములాంటిది. ఏ మాత్రం తేడా వచ్చినా ఇక అంతే సంగతులు. ఐనా వాళ్ళు కొత్తవాళ్ళను అంత తేలిగ్గా నమ్మరు. నా మాటిని వెనక్కి తిరిగి హాయిగా ఇంటికెళ్ళిపో...." పోల్రాజు ఇంటి దగ్గర నుండి వాళ్ళ ఇంటికి చేరుకునేదాకా శాంతారామ్ అంకుల్ నాకు పాఠం చెబుతూనే ఉన్నాడు.

పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గానీ పోదన్నట్టు" నా ప్రవృత్తే కొంచం భిన్నమైందని పాపం అంకుల్‌కేం తెలుసు? అమ్మా, నాన్న వాళ్ళు మెడిసిన్ కోసం లండన్ వెళ్ళమంటే కాదూ, కూడదని పట్టుపట్టి చైనా వెళ్ళి చదువుకున్నవాణ్ణని"?

"ఎలాగూ ఇంత దూరం వచ్చాను కదా అంకుల్!చూద్దాం ఏం జరుగుద్దో? మీరన్నట్టు నిజంగా వాళ్ళతో ఏవైనా ఇబ్బందులొస్తే అప్పుడే వెనుదిరిగి పోతాలెండి." బైక్ స్టాండ్ వేస్తూ అన్నాను. దానికాయన "మంచిది బాబూ ! నీ ఇష్టం" ముక్తసరిగా అంటూ ఇంట్లోకి దారి తీశాడు.

✿ ✿ ✿

నిన్నసాయంత్రం ఇల్లందులో కొన్న ముఖ్య

**అడవిలో అడుగుపెట్టినప్పటి నుండి ఇంత వరకు ఓ మనిషి గాని, మనిషి అలికిడి గాని కన్పించ లేదు. కను చీకటి అయ్యేలోపుగానే కుందేలు గుంపు చేరుకోవాలన్నఆతృత నా దేహంలోని ప్రతి అణువు లోనూ ద్యోతకమౌతుంది.**

మైన సామాన్లన్నింటిని బ్యాగ్‌లో జాగ్రత్తగా సర్దుకున్న నేను గుండాల ప్రైమరీ హెల్త్ సెంటర్ వాళ్ళ జీప్‌లో ఎక్కి కొమరారం ఆవల రెండుకిలోమీటర్లు వెళ్ళాక కుందేలు గుంపు వెళ్ళే అడవి దారి ముందు దిగాను.

అక్కడ దిగిన నేను ఒక్కసారి నిలబడి చుట్టూ పరికించి చూస్తే... ఎటు చూసినా 'కి(గ్రు'మంటున్న అడవే కన్పిస్తుంది.

ఆ అడవి పచ్చదనాన్ని ఊర్ధ్వలోకాలకు కొంపోతున్న మహాకాయుల్లా పేర్లు తెలియని ఎన్నెన్నో కొండలు ఎంతెంతో ఎత్తున కనపిస్తున్నాయి.

అడవి చెట్లకు కొండ చిలువల్లా పెనవేసుకు పోయిన రకరకాల అడవిపూల తీగలు ఆనందంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

ఎందుకో గాని, ఆ సమయంలో ఏ చప్పుడూ లేని అడవి మృత్యుగుహను తలపిస్తూ భయపెడు తుంది. ఐతే, అంతలోనే భయపడాల్సిందేమీ లేద న్నట్టుగా దూరంగా ఎక్కడో అడవిని అధిగమిస్తూ సుడులు, సుడులుగా మబ్బుల్లోకి సాగిపోతున్న పల్చటి పొగ మనుషుల ఉనికిని పట్టి చూపుతూ నన్ను ముందుకు నడిపించింది.

ఏకబిగిన మైళ్ళ కొద్దీ కాలినడక జీవితంలో మొదటిసారి కావడంతో కాళ్ళు పీకసాగాయి.

ఎంతదూరం నడిచానో తెలియదు గాని, ఎప్పుడో బాహ్య ప్రపంచంతో సంబంధం తెగి పోయిన సెల్‌ఫోన్లో సమయం మాత్రం మూడు గంటలు చూపిస్తుంది. ఐతే, అడవి చెట్ల గొడుగు సూర్యుణ్ణి కమ్మెయ్యడంతో అప్పుడప్పుడే సంధ్య చీకట్లు ముసురుకుంటున్నట్టుగా ఉంది.

నేనెన్నడూ ఎరుగని అడవి అందాల రసా విష్కరణను సంపూర్ణంగా ఆస్వాదించలేని ఓ డోలాయమాన స్థితిలోనైన నేను పోను, పోను పై మీది కందువానే బరువౌతుందన్న సామెత అను భవంలోకొస్తుంటే నా వీపు మీది బ్యాగ్ నల్లరాతి గుండులా భారంగా అన్పిస్తుంటే నడకలో వేగం క్రమంగా సన్నగిల్లసాగింది...

అడవిలో అడుగుపెట్టినప్పటి నుండి ఇంత వరకు ఓ మనిషి గాని, మనిషి అలికిడి గాని కన్పించ లేదు. కను చీకటి అయ్యేలోపుగానే కుందేలు గుంపు చేరుకోవాలన్నఆతృత నా దేహంలోని ప్రతి అణువు లోనూ ద్యోతకమౌతుంది.

అటువంటి పరిస్థితిలోనూ నా మెదడు ఓ విషయాన్ని పసిగట్టింది.

వాటి పేర్లేంటో నాకు తెలియదు గాని, వేల రకాల చెట్లతో నిండిన ఆ అడవి దారిలో లోపలికి వెళుతున్న కొద్దీ ఓ మూడు, నాలుగు రకాల చెట్లకున్న కొమ్మలన్నింటిని సిపాయిలకు క్షవరం చేసినట్టుగా ఎవరో చెలిగి పారేశారు. అందుకు నిదర్శనంగా ఆ చెట్ల చుట్టూ ఎండిపోయిన మండలు బండ్ల కొద్దీ పడి శిథిలమవుతున్నాయి.

నన్నెందుకా విషయం ప్రత్యేకంగా ఆకర్షిం చింది ?

ఏమో ! కొన్ని విషయాలు హేతువుకందవు కదా !

పోను పోనూ దారి ఇరుకౌతుంది.

చీకటి చిక్కబడుతుంది.

అప్పటికప్పుడే అడవి మేలుకుంటుంది.

తెలియని భయం ఇంకా, ఇంకా నాలో జడలు విప్పుకుంటుంది.

అంతలో.....

ఓ హ్హోయ్ - హ్హోయ్ - ఓ హ్హోయ్

ఓ హ్హోయ్ - హ్హోయ్ - ఓ హ్హోయ్ !

నా దారికి ఎడమవైపునున్న చిన్న గుట్ట దాపు నుండి ఎవరో కొందరు, దేన్నో మోసుకుంటూ వేగంగా నడిచి వస్తున్న సవ్వడి !

అప్పటిదాకా మనిషి ఉనికి కోసం తపిస్తున్న నా మనసుకు ఓ గుప్పెడు ధైర్యమొచ్చింది.

నడుస్తున్నవాడినల్లా నిలబడిపోయి చూస్తుండ గానే కొందరు మనుషులు ఓ కర్రల మంచాన్ని డోలీగా చేసుకుని, దానిమీద వంటినిండా గాయాలతో నెత్తురోడుతూ స్పృహ కోల్పోయిన క్షతగాత్రునొకణ్ణి మోసుకొస్తున్నారు.

హఠాత్తుగా ఎదురైన పులికి సైతం భయ పడనివాళ్ళు కాస్తా నేను కనిపించేసరికి ఒకింత భయంతోను మరికొంత ఆశ్చర్యంతోనూ, భుజాలమీది బరువుతోనూ నిశ్శబ్దంగా నిలబడిపోయారు.

ఆ డోలీ మీది మనిషి వళ్ళంతా ఏదో పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా చీల్చి పారేసినట్టుగా ఐపోయి రక్తం విపరీతంగా స్రవిస్తుంది. ఇంకో నాలుగ్గంటలపాటు అతణ్ణి అలాగే వదిలేస్తే శరీరమంతా విషపూరితమౌతుందని చూస్తేనే తెలిసి పోతుంది.

అంతే !

నాలో డాక్టర్ వెంటనే మేలుకున్నాడు. అప్పుడు తనెక్కడున్నాడు ? తన పరిస్థితేమిటి? వంటి విషయాలేవీ అతని బుర్రకు తట్టలేదు ! వెంటనే వీపు మీది బ్యాగ్‌ను కిందికి జారవిడుస్తూ "ఏమైందిత నికి ?" అంటూ ప్రశ్నించాడు. ఆ కంఠంలో తొంగి చూస్తున్న గాంభీర్యానికి, అడిగిన తీరుకూ వాళ్ళంతా నాదస్వరానికి లోబడిననాగుల్లా మారిపోతు మంచాన్ని కిందికి దించి "ఎలుగుబంటు దాడి జేసింది" గుంపుగా అన్నారు.

వెంటనే బ్యాగ్ తెరిచి మెడికల్ కిట్‌తో పాటు ఎందుకైనా పనికొస్తాయని ఇల్లందులో కొన్న ఎమర్జెన్సీ మందులన్నీ బయటకు తీసి వాటిల్లో నుండి వెంటనే

# నయం

ఫర్వాలేదు
నేను
బతికే ఉన్నాను
మధ్యాహ్నం
భోంచేసి కూచుంటానా
ఏటి కెరటాల పాట
ఎదని తాకుతుంది
ఆలోచనా తరంగాలు
చెలియలి కట్టని దాటి
ఉవ్వెత్తున శిరస్సుమీదకి
వచ్చి పడతాయి
ఏదో ఒక కథ
కాళ్ళకు చుట్టుకుంటుంది
గుండె తలుపులు
బార్లా తెరుచుకుంటాయి
మృదు సురభి
మనస్సు నిండా
మానవాళి
దళసరి
మొద్దు చర్మాల
భీభత్సపు
బతుకు దృశ్యాలు
చూసి చూసి
బండ పారిపోలేదు
నయం
బతికే ఉన్నాను !

- డా॥ చాగంటి తులసి

సెఫెక్జిమ్ ఇంజక్షన్ చేసి డెట్టాల్లో ముంచిన కాటన్‌తో గాయాలన్నీ శుభ్రం చేస్తుంటే చిమ్మటి చీకట్లు అలుముకోవడంతో బ్యాగ్‌లోని టార్చ్ కోసం వెతుకులాడుతుంటే అప్పటిదాకా అయోమయంగానూ, ఆశ్చర్యంగానూ కళ్ళప్పగించి చూస్తూ నిల్చున్న వాళ్లల్లో చలనం వచ్చి అందరికంటే పెద్దాయనొకడు "సూస్తరేం దిరా ! నెగడు బెట్టండి" అంటూ మిగతా వాళ్ళకు పని పురమాయించాడు.

వాళ్ళు వెంటనే ఇంతకుముందు నేను గమనించిన చెట్లకింది ఎండు పుల్లలను ఏరుకొచ్చి మంచానికి నాలుగువైపులా పెద్ద,పెద్ద నెగళ్ళు వేశారు.

గాయాలు మొత్తం తుడిచి శుభ్రం చేసిన తరువాత డ్రస్సింగ్ చేసి, చేతులు కడుక్కునే సరికి విపరీతమైన అలసటకు గురైన నా శరీరం దిగ చెమటలు పట్టి ఆకలిగా అనిపించడంతో బ్యాగ్‌లో ఉన్న బిస్కెట్లు తిందామని తీసి నా ఎదురుగా ఉన్న వాళ్ళకూ ఇవ్వబోతే, వాళ్ళు సిగ్గుతో మొహమాట పడుతూ తీసుకోవడానికి నిరాకరించడంతో చేసేదేం లేక నేనో నాలుగు బిస్కెట్లు నోట్లో వేసుకున్నాను.

అప్పటిదాకా జరుగుతున్నదంతా ఓ కలలా అనుభూతి చెందుతున్న వాళ్ళను ఆ నెగళ్ళ వెలుగులో పరికించి చూశాను. వాళ్ళు మొత్తం ఆరుగురున్నారు. వాళ్ళంతా కూడా పొట్టి కురచగా ఏనెరాళ్ళ రంగులో ఉన్నారు. వాళ్ళ ముక్కు తమ్మెలు వెడల్పుగానూ, కళ్ళు చిన్నవిగానూ ఉన్నాయి. వాళ్ళ తలకట్లన్నీ రాగివర్ణంతో దువ్వెన కూడా దూరనంత రింగులతో తలకు అతుక్కుపోయినట్టుగా ఉన్నాయి. ఎవ్వరికీ వంటిమీద చొక్కాల్లెవ్వు. గళ్ళ లుంగీలను నడుస్తుంటే కాళ్ళకు అడ్డు రాకుండా మోకాళ్ళ పైకి మడిచి కట్టుకున్నారు. అందరి చేతుల్లోనూ పట్టుడు కర్రలున్నాయి. ఏ ఒక్కరి కాళ్ళకు కూడా చెప్పులన్నవి లేనేలెవ్వు. ఇంకా చెప్పాలంటే చిత్రంగా వాళ్ళకెవ్వరికీ కనుబొమ్మలు కానీ, మూతిమీద మీసాలు కానీ లేవు. వాళ్ళ ఆకారాలను చూసి వయసెంతో చెప్పడమన్నది ఎవరికైనా బ్రహ్మ ప్రళయమే.

నేనిచ్చిన బిస్కెట్లను తీసుకోకుండా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ నిల్చున్న వాళ్ళను ఉద్దేశిస్తూ "మీరెందుకిలా బిస్కెట్లు తీసుకోకుండా నిల్చుని చూస్తున్నారు ? నేనూ మీలాంటి మనిషినే కదా ఫరవాలేదు తీసుకోండి" మళ్ళీ ఓ ప్రయత్నం చేస్తూ అన్నాను.

ఆ సరికే వాళ్ళ కళ్ళల్లో నేనా మంచం మీది క్షతగాత్రుణ్ణి బ్రతికించడానికొచ్చిన ఆ కొండదేవరనే అన్న భావం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంటే "ఇంతకు మందేవూరు మామా ! ఈ యాల్లప్పుడీ యడివిన బడి నడ్సొస్తున్నవాడికి?!" 'మామా' అన్న సంబోధన నాలో ఓ రకమైన ప్రకంపనలు కలిగిస్తుంటే చిత్రంగా అడిగాడు ఇందాకటి పెద్దాయన.

"నేనో డాక్టర్ని. మాది సూర్యాపేట. కుందేలు గుంపుకు పోదామని వస్తున్నా" చెప్పాన్నేను.

నా మాటలతో మరింత ఆశ్చర్యానికి లోనైన ఆ పెద్దాయన "కుందేలు గుంపుకా !?" అన్నాడు.

అతని వాలకం చూస్తుంటే "వెదకబోయిన తీగ కాలికే తగిలేటట్టుంది" అనుకున్నాను.

నెగడు మంటల్లో పడి 'చిట, పట' మంటూ మాడిపోతున్న రకరకాల కీటకాల, అడవి దోమల కమురు వాసనకు ముక్కుపుటాలు అదిరిపోతున్నా అలాగే భరిస్తూ నేనేదో అడగాలనుకుంటుండగానే ఇందాక నేనిచ్చిన ఇంజక్షన్ పనిచేయడం మొదలు పెట్టిందేమో ? గాయాల బాధ మెల, మెల్లగా మెదడుకు చేరడంతో మంచం మీది క్షతగాత్రుడు కాస్తా విపరీతంగా మూలుగుతూ కాళ్ళూ, చేతులు 'తప, తప' మని మంచం పట్టెలకేసి కొట్టుకోవడం మొదలుపెట్టాడు.

చప్పున లేచిన నేను వెంటనే మళ్ళీ ఓ రెండు సెఫిక్జిమ్, టి.టి. ఇంజక్షన్లు ఇచ్చి మరో అర్థగంట తరువాత ఆ రాత్రికి నొప్పుల బాధ తెలియకుండా ఉండడానికి డైక్లోఫినాక్ ఇంజక్షన్ చేసి ఎందుకైనా మంచిదని కాంపోజ్ కూడా ఇచ్చాను.

ఇక తెల్లవారేదాకా రోగి లేవను గాకలేవడు.

క్రమక్రమంగా అడవంతా చల్లబడి అసౌకర్యంగా మారిపోతుండడంతో పేషెంట్‌ను వెంటనే ఇంటికి చేర్చాలని చెప్పాను.

మారు మాటాడకుండా లేచిన వాళ్ళంతా నా బ్యాగ్ అందుకుని పేషెంట్ ఉన్న మంచం కోడుకే తగిలించి, మంచాన్ని భుజాలకు ఎత్తుకుని మళ్ళీ 'హ్వోయ్, హ్వోయ్' మంటూ ఊరివైపు కదిలారు.

వాళ్ళ వెనుక పరుగులు పెడుతున్న నేను "ఇంతకూ వీళ్ళది కుందేలు గుంపేనా?" అనుకున్నా.

✿ ✿ ✿

తెల్లారి నేను లేచేసరికి ఉదయం ఎనిమిది గంటలవుతుంది.

ఓ క్షణం పాటు నేనెక్కడున్నానో అర్థం కాలేదు.

అర్థమయ్యేసరికి దిగ్గున లేచి కూర్చున్నాను.

రాత్రి సరిగా గమనించలేదు గాని, నేను పడుకున్న ఆ చుట్టుగుడిసె గోడా, క్రింద నేలా పుట్ట మన్ను, ఆవుపేడ కలిపి అలికారేమో గాని నున్నగా, పచ్చగా అందంగా మెరుస్తుంది. మెరుస్తున్న ఆ అలుకు మీద రకరకాల 'నాము' ముగ్గులు దిద్దబడి అద్భుతమైన ఓ పర్ణశాలలా కన్పిస్తుంది.

నా బ్యాగ్ ఎదురుగా ఉన్న చిలుక్కొయ్యకు తగిలించి ఉంది.

ఇప్పటిదాకా జరిగిన ఒక్కో సంఘటనను తలపోస్తూ మరికొంతసేపు అలాగే కూర్చున్న నేను మెల్లగా లేచి బయటికొచ్చేసరికి ఆశ్చర్యకరంగా ఆ గూడెం గూడెమంతా ఆపాక ముందే గుమిగూడి నా కోసమే నిశ్శబ్దంగా ఎదురుచూస్తూ కూర్చునట్టుగా ఉంది.



28-4-08న కాకినాడ రోటరీ క్లబ్ ఆడిటోరియంలో హైదరాబాదు చందానగర్‌కు చెందిన ఉషారాణి కవితాసంపుటి ఆవిష్కరణ జరిగింది. చిత్రంలో కుడి నుండి జి. సుబ్బారావు, అద్దేపల్లి రామమోహనరావు, ఉషారాణి, పి.చిరంజీవినీ కుమారి, మాకినీడు సూర్యభాస్కర్ లు ఉన్నారు.

"ఎందుకు వీళ్ళంతా ఇక్కడ కూర్చున్నారు!?" నేననుకుంటుండగానే నా దగ్గరకొస్తూ "మా గుంపంతా నిన్ను సూద్దామని వచ్చిండ్రు మామా ! రాత్రి సెప్పలేదు గదా నా పేరు సిలకన్న. ఈ కుందేలుగుంపు పెద్దను. నువ్ మా గుంపుకెందుకొస్తున్నావ్? ఏం పని మీదొస్తున్నావ్? నలభైఏండ్ల కింద నీ లెక్కనే ఉన్నాయన ఒకాయన ఇట్లనే మా గుంపును ఎతుక్కుంట వచ్చిండు. ఆయన జేసిన పని మా బతుకుల్ల ఎన్నెల నింపుద్దనుకుంటె, అసలే తెల్లారని అమాసజేసింది" అంటూ ఏ జ్ఞాపకాల వెదురు పొదలు అంటుకున్నాయో గాని, మౌన విషాదంగా నా కెదురు నిల్చి వినయంగా చెప్పాడు 'చిలకన్నా' అనబడే రాత్రి పెద్దమనిషి.

అంతలో ఎవరో ఆడమనిషి పరుగెత్తుకుంటూ వచ్చి "తాతా ! ఓండు లేది ఓ నొప్పి ఇంజోరె అడతనోండు" అంటూ చిలకన్నతో వారి భాషలో ఏదో చెప్పింది.

వెంటనే చిలకన్న నా వైపు తిరిగి "మామా! రాత్రి వాడికి మెలుకొచ్చి నొప్పులని ఏడుస్తుండంట" అన్నాడు.

నేను చప్పున లేచి బ్యాగందుకుని చిలకన్న వెనుకే పేషెంట్ ఇంటివైపు కదిలాను.

✿ ✿ ✿

పేషెంట్‌కి జ్వరం తగిలింది. కాంబీఫ్లోమ్ ఇంజక్షన్ చేసి, పారాసెటమాల్ టాబ్లెట్ వేశాను. పావుగంట తరువాత జంటామైసిన్ ఇచ్చి "ఈ పూట కేదైనా జావ తాగించండి" అంటూ చెప్పి బైటపడ్డాను.

బైటకొచ్చిన నన్ను చూస్తూనే "ఏంది మామా! బైలుకు బొయ్యొస్తవా ?" చిలకన్న దగ్గరకొస్తూ అడిగాడు.

అతని అవగాహనకు విస్తుబోతూ వెళ్ళాలన్నట్టు తల ఊపాను.

నా చేతిలోని బ్యాగ్‌ను చొరవగా తీసుకుంటూ.... గూడానికి తూర్పువైపుగా దారి తీశాడు చిలకన్న.

తొమ్మిది గంటలు దాటిపోతున్నా ఆ అడవిలో సూర్యుని జాడ అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. వందల రకాల పక్షులు, వేల గొంతుకల సుస్వర నాదాలతో వనమంతా పులకించిపోతుంది. అడవి పూల మకరందాన్ని ఆస్వాదించిన తుమ్మెదల గుంపులు ఝుంకారాలు చేస్తూ ఎక్కడెక్కడికో ఎగిరిపోతున్నాయి. మా చుట్టూ ఉన్న పచ్చని కొండల మీద వాలుతున్న తెల్లని మేఘమాలికలు ప్రకృతి కాంతకు వింత శోభను ఏర్పరుస్తున్నాయి. ఉండీ, ఉండీ ఏవేవో జంతువులు భీకరంగా అరుస్తున్నాయి. చెట్లమీద రాత్రి కురిసిన హిమ సమూహం సూర్య రశ్మికి ముత్యాలుగా కరిగి, 'టప, టప' మని ఒక్కో

**ఆ విషయం ఎవరు కనిపెట్టారో ? ఎప్పుడు కనిపెట్టారో ? ఎలా కనిపెట్టారో ? ఎరుగను కాని ఎండు తుమ్మకాయతో పాటు ఆ మూడు చెట్ల ఆకులను మేసిన మేకల కడుపుల్లో రంగురాళ్ళు పుడతాయని మొదటిసారిగా తెలుసుకున్న నేను నమ్మలేక పోయాను. ఐతే, నేను విన్నదంతా యదార్థమేనని ఆ తర్వాత రూఢీ చేసుకున్నా**

ఆకునూ ముద్దాడుతూ నేలజారే దృశ్యం కంటితో చూసి ఆస్వాదించేదే తప్ప నోటితో వర్ణించేది కాదు.

అలా నన్ను నేను మరిచిపోయి చూస్తూ మరికొంత ముందుకు వెళ్ళేసరికి అడ్డుగా వచ్చిన ఓ పెద్ద కొండచరియ మీద నుండి కణ, కణ నిక్వణ నాదంతో కిందికి దుముకుతున్న అద్భుతమైన కొండవాగొకటి ఎదురొచ్చింది. ఆ కొండవాగు సౌందర్యానికి చేష్టలుడిగి నిల్చున్న నన్ను పట్టి కుదుపుతూ "మామా ! అగో అటు పొయిరా !" అంటూ దూరంగా చెయ్యి పెట్టి చూపి తానో 'రేలచెట్టు' కింద ఆగిపోయాడు చిలకన్న.

చిలకన్న చూపించిన వైపుకెళ్ళి కాలకృత్యాలు తీర్చుకున్న నేను నా చాలప్యం కొద్దీ వాగు వొద్దునే మరికొంత ముందుకెళ్ళి చూసేసరికి వాగుకు ఆవలి ఒడ్డున ఎవరో కొందరు మనుషులు తమ భుజాల మీద ఏవో బస్తాలు మోసుకుంటూ అడవి లోపలికి వెళుతున్నారు.

"ఎవరబ్బా !" అనుకుంటూ వాగులోకి దిగిన నేను ఆశ్చర్యంతో కళ్ళు తేలవేశాను. ఆ వాగు నీళ్ళ స్వచ్ఛతకు అడుగున ఉన్న ఇసుక రేణువులు బంగారు రజనులా తళుకులీనుతూ స్పష్టంగా కనిపిస్తున్నాయ్ ! నీళ్ళల్లో కదలాడుతున్న రకరకాల చిరు చేపలు, నయగారాలు ఒలికిస్తూ ర్యాంప్ మీద తుళ్ళిపడే సుందరీమణులను తలదన్నుతున్నాయి. ఆ కొండవాగు గల, గలల సరిగమలకు అడవి, అడవంతా తన్మయత్వంతో తల ఊపుతుంది.

పుట్టిన తరువాత అదే నా మొదటి స్నానం అన్నంత ఆర్తిగా వంటిమీద నూలు పోగన్నది లేకుండా ప్రకృతిలో మమేకమై నా వంటిమీది మురికితో పాటు నా అంతఃకరణలోని మాలిన్యం కూడా తుడ్చి పెట్టుకు పోయేలా తనివితీరా స్నానం చేసి దూది పింజలా తేలిపోతున్న తనూ, మనస్సులతో ఒడ్డెక్కాను.

ఆ పాటికే ఏవేవో అడవి పండ్లు కోసుకొచ్చి నా కోసమే ఎదురుచూస్తూ కూర్చున్న చిలకన్న నేను సమీపించగానే తను కూర్చున్న చెట్టుకిందనే ఉన్న ఓ చిన్న బండమీద నన్ను కూర్చోబెట్టి పండ్లను ముందట పెట్టాడు. ఆ పండ్లను తింటూ కూర్చున్న నా మనసు, తినడంలోని సిసలైన మధురిమను సంపూర్ణంగా అనుభవించసాగింది.

అలా పండ్లు తింటూ కూర్చున్న నన్ను తదేకంగా చూస్తూ కూర్చున్న చిలకన్న కొంతసేపటికి "మామా !" నిన్ను చూసినప్పటి నుంచి ఈ మనిసినాడో సూసిన్నే అన్పిస్తుంది. యాడ సూసిన్నో గాని ఎంత కొట్టుకున్నా గ్యాపకానికి వస్తలేదు" అన్నాడు దీర్ఘంగా ఆలోచిస్తూ....

ఔను మరి. తాతా మనవళ్ళు ఒకటేగా, తాతగారి పోలికలు సంపూర్ణంగా నాలో కన్పిస్తాయి. తాతయ్య రేంజర్‌గా ఈ అడవుల్లో తిరుగాడినప్పుడు ఈ చిలకన్న ఎప్పుడో అప్పుడు తప్పకుండా చూసే ఉంటాడు. ఆ మూర్తే ఇతని స్మృతిపథంలోని పొరల్లో దాగి ఉండి నన్ను చూడగానే ఆ జ్ఞాపకాలపొరల్లో ప్రకంపనలు రేకెత్తిస్తుంది కాబోలు !


"ఎప్పుడో నలభై ఏళ్ళ కింద ఈ అడవిలో పనిచేసిన రేంజర్‌రాఘవయ్య రాయుడు తెలుసా నీకు" అంటూ చిలకన్న మీదికి ఓ బాణాన్ని సూటిగా సంధించి వదిలాను.

నాబాణం లక్ష్యచ్ఛేదనం కావించినట్టేఉంది. అతని ముఖంలో క్రమంగా జ్ఞాపకాల ఉద్విగ్నపు నెత్తుటి ఊటలు చివ్వున చిమ్ముతుంటే తటాలున వచ్చి నా చేతుల్లో ఇముడ్చుకుంటూ "ఏంది మామా! నువ్వాయన మనవనివా ఏంది !?" నిలువెల్లా ఆశ్చర్యంతో కదిలిపోతూ అన్నాడు చిలకన్న.

"ఔను" ఆ గుర్తింపుకు నాలోనూ నిర్వచనానికి అందని ఉద్వేగం.

స్మృతుల వర్షంలో తడిసి ముద్దైపోయిన చిలకన్న కొంతసేపటికి తెప్పరిల్లి "పొద్దున నేనన్నది ఆయన గురించే మామా ! ఆ మారాజు పెద్దపులి లెక్క అడివి మీద తిరిగినంత కాలం ఏ పాపిష్టోడి

కన్నూ అడివిమీద పళ్ళేదు. మేమంత కడుపులోసల్ల కదలకుంట బతికినం. ఆయన చేతుల మీదనే నా పెళ్ళి జరిగింది. ఆయన కొలువు దిగిపోయినంక ఈ సుట్టు ముట్టు పది, పన్నెండు గూడాల మందిమి కన్నమ్మ కష్టాలు పడీ, పడీ రాటుదేలిపోయినం" అంటూ ఎన్నెన్నో ఊసులు చెప్పుకొచ్చిన తను అంతలోనే ఏదో గుర్తుకొచ్చిన వాడిలా "ఔను మామా! అసలిప్పుడు నువ్ మా గుంపు నెతుక్కుంట ఎందు కొస్తున్నవ్?" అంటూ ప్రశ్నించాడు.




పెద్దగా కష్టపడకుండానే రావాల్సిన చోటుకొచ్చినందుకు ఆనందిస్తూ విషయం వివరించాను.

నా మాటలన్నీ శ్రద్ధగా విన్న చిలకన్న అసలు విషయం దగ్గరకొచ్చేసరికి ఎందుకో గాని ఒక సంశయానికి లోనైనట్టు కనిపించినా ఎలాగైతేనేమి ఆఖరికి నోరు విప్పాడు.

✿ ✿ ✿

"నేను అదిలాబాద్ అడవిమీద పనిచేస్తున్నప్పుడు అక్కడ అన్ని చెట్లకన్నా కొడిశ, పంచోది, ఏపె చెట్లు విపరీతంగా ఉండేయి.

ఆ విషయం ఎవరు కనిపెట్టారో ? ఎప్పుడు కనిపెట్టారో ? ఎలా కనిపెట్టారో ? ఎరుగను కాని ఎందు తుమ్మకాయతో పాటు ఆ మూడు చెట్ల ఆకులను మేపిన మేకల కడుపుల్లో రంగురాళ్ళు పుడతాయని మొదటిసారిగా తెలుసుకున్న నేను నమ్మలేకపోయాను. ఐతే, నేను విన్నదంతా యదార్థమేనని ఆ తర్వాత రూఢీ చేసుకున్నా.

ఆ రంగురాళ్ళు ఏదో వైద్యానికి పనికొస్తాయని తెలుసుకున్నా. కాని, ఖచ్చితంగా ఏ రోగానికి పనికొస్తాయో మాత్రం తెలుసుకోలేకపోయాను. ఐతే, ఆ రాళ్ళ కోసం బలార్షా, నాగపూర్ల నుండి బేరగాళ్ళొచ్చి తులం రాళ్ళను నాలుగైదొందలల్లెక్క కొనుక్కుపోవడం కళ్ళారా చూశాను. అందువల్లే కాబోలు అక్కడి గిరిజనుల బ్రతుకుల్లో దారిద్ర్యం తొలగిపోయి సుఖంగా బ్రతకడం కన్పించేది.

ఆ తరువాత కొద్దిరోజులకే నాకిక్కడికి బదిలీ కావడంతో వచ్చేశాను. తీరా ఇక్కడికొచ్చి చూస్తే అవే కొడిశ, పండోది, ఏపె వనాలు అక్కడి కంటే ఇక్కడ ఇంకా ఎక్కువగా ఉన్నాయి. అవి చూసిన దగ్గర్నుండి నాలో ఓ ఆలోచన మొదలైంది. అదే రాళ్ళమేకలను మీరు ఇక్కడ ఎందుకు పెంచగూడదని ? మీరు కూడా తరతరాల దారిద్ర్యం నుండి ఎందుకు బైట పడకూడదని? మీరు ముందుకొస్తే ఇటు మా జంగ్లాత్ వాళ్ళను అటు రాళ్ళు కొనుక్కుపోయే బేరగాళ్ళను నేను ఒప్పిస్తాను." ఆ రోజు మిట్టమధ్యాహ్నం పాండవుల గుట్టమీద ధర్మరాజుల మంటపంలో కుందేలు గుంపుతో పాటూ ఆ చుట్టుపట్టు గుంపుల జనాలను కూడదీసి రాళ్ళమేకల విషయాన్నంతా అరటిపండు వలచి చేతిలో పెట్టినంత ఇదిగా వివరించాడు రేంజర్ రాఘవయ్య రాయుడు.

"జంగ్లాత్ ఆఫీసరే మాటిచ్చినంక కాదనే టందుకేముంది ?

ఆ ఈ జంగ్లాతోళ్ళు ఇయ్యాలొక తీరిగ మాట్లాడ్తరు. రేపింకో తీరిగ మాట్లాడ్తరు గానీ

ఈనికి లాభం లేకుంటే మనకెందుకు జెప్తుతడు !?

ఇందుల ఏదో మతలబుంటది గానీ "రక రకాల ఆలోచనలు చేస్తున్న ఆ గిరిజనుల మనసులను చదివిన రేంజర్ రాయుడు "మీరంతా అనుకుంటున్నట్టు ఇందులో నాకే స్వార్థమూ లేదు. మీకేదో సాయం చేయాలన్న ఆలోచన తప్ప, మీ ఇష్టం బాగా ఆలోచించుకొనే చెప్పండి"అంటూ లేచి గుర్రమెక్కాడు.

ఓ పదిరోజుల పాటు ఆలోచించుకున్న గిరిజనులంతా ఓ రోజు రేంజర్ రాయుణ్ణి కలిసి తను చెప్పినట్టే రాళ్ళమేకలు పెంచడానికి తమ ఆమోదం తెలియజేశారు.

ఐతే, ఆ రాళ్ళమేకలు పెంచే ఏ గుంపు వాళ్ళైనా సరే ఆ మూడు రకాల చెట్లు తప్ప అడవిలో మరే వస్తువు జోలికీ పోకూడదనే ఒప్పందంతో ఆ గిరిజనుల ముందరి కాళ్ళకు బంధం వేశాడు రేంజర్ రాయుడు. ఆ విధంగా తనకే స్వార్థం లేదంటూనే వృత్తి స్వార్థాన్ని చూపించాడా రేంజర్.

ఎప్పుడో రాబేయే రంగురాళ్ళ డబ్బుల ఆశలో పడి అడవి మీద వాళ్ళకున్న హక్కుల్ని అమాయకంగా తాకట్టు పెట్టేసుకున్నారా గిరిజనులు.

కొమరారం అడవుల్లోరాళ్ళమేకల పెంపకం అట్లా మొదలైంది.

✿ ✿ ✿

గతం గనుల్లోనుండి జ్ఞాపకాల ఖనిజాలను వెలికి తీస్తూ చిలకన్న ఎన్నో విషయాలను వివరించాడు.

జరిగే ప్రతి చారిత్రక సంఘటనలో తెలిసి కొందరు, తెలియక కొందరు పాత్రదారులౌతుంటారు. కానీ, రాళ్ళమేకల సంఘటనలో మా తాతగారే సూత్రధారి కావడం అనేది నిజంగా యాదృచ్ఛికమే.

ఆ విధంగా మాటల్లో పడ్డ మేమిద్దరం గ్రామంలో కొచ్చింది గూడా గమనించుకోనేలేదు.

చిలకన్న వాళ్ళఇంట్లో నాకేర్పాటు చేసిన వెదురు బియ్యపు అంబలి, ఆరెకాకరకాయ కూర తింటుంటే ఆ రుచి ముందు నా జీవితంలో అప్పటి దాకా నేను తిన్న తిండి వట్టి ఎండు గడ్డి కిందే లెక్క అన్పించింది.

అంబలి తాగి చిలకన్న ఇంటిముందు విప్ప మాను కింద నులక మంచంలో కూర్చున్న నా చుట్టూ ఆ కుందేలు గుంపంతా చేరింది.

అప్పటికే వాళ్ళందరికీ నేనెవ్వరో తెలిసిపోవడంతో ఇప్పుడు వాళ్ళకు నేనో ఆత్మబంధువునైపోయాను. దాంతో వాళ్ళంతా ఏ దాపరికము లేకుండా తమ గోడునంతా వలపోసుకో సాగారు....

"మీ తాత, ఇచ్చిన మాట తప్పలే.తను ఈడ ఉన్నంత కాలం మమ్మల్ని కన్నబిడ్డలల్లెక్క కాపాడుకుండు. రాళ్ళమేకలు పెట్టుకున్న మేము పిల్లా జెల్లా కడుపు నిండా తిని, కంటినిండా పన్నం. ఆయనెప్పుడైతే తవాదలై పోయిండో అప్పట్నుంచి మల్లా మా బతుకులన్ని మంగలంల పేలాలెక్కనై.

ఇల్లందుల కటిక దుకాణాలు నడిపే బురాను సాయిబుకు ఎట్ల తెల్సిందో గాని మా రాళ్ళ మేకల సంగతి తెలిసిపోయింది. అగో అప్పట్నుంచి ఎందు సొపల కోసం నాసు బెట్టుక్కూసున్న గండు పిల్లి లెక్క సమయం కోసం కాసుక్కూసుండు.

అడక్కుంటనే అప్పులియ్యబట్టిండు. చెప్పకుంటనే చేబదులియ్యబట్టిండు. మా ఆడోండ్లకు పౌడర్ డబ్బాలు, తిలకం సీసాలు, వాసననూనెలు, పూసల దండలు ఇయ్యబట్టిండు. పానానికి పానమట్ల మాతోని దోస్తానం చెయ్యబట్టిండు. మా పంచాయితులు తీర్మానం చెయ్యబట్టిండు. మాగుట్టు మట్లన్ని గుంజుకుండు.

రాంగ రాంగ రంగురాళ్ళకోసమొచ్చే బేరగాళ్ళను మచ్చిక జేసుకుండు. ఆల్లు మా కాడికి రాకుంట మజ్జెన జొర్రిండు. రాళ్ళ ఋతువు తెలుసుకొని మా కాడ తులం రూపాయగ్గొంటె ఆళ్ళకు రొండు రూపాయలకమ్మబట్టిండు. కాలా, చేతా పైసలు

కూడబెట్టిండు. చివరాకరికి మేం అన్నలకు అన్నం బెడుతున్నమని, ఆల్లతోని రాసుక పూసుక తిరుగుతున్నమని జెప్పి పోలీసోల్లను మా మీదికి ఉసిగొలిపిండు. బాకీల పేరు జెప్పి మా మేకలు, దొడ్లు గుంజుకుండు. మమ్మల్ని గూడు లేని పచ్చులెక్క జేసి వదిలేసిండు.

"తిండికి, బట్టకు ఎల్లనిమేం మల్లా ఎప్పట్లెక్కనే అడివి మీద బడి కాయో, గసరో ఏరుకోని, మా మేకల దొడ్డల్ల మేమే జీతగాళ్ళమై ఎట్టి బతుకు బత్తున్నం అంటూ వాళ్ళు చెబుతున్న ఒక్కో మాటా నాలో ఓ అనూహ్యమైన భావోద్వేగాన్ని రగిలిస్తుంటే "అదేంటి !? ఇదంతా అన్నల రాజ్యం అంటారుగా ఇంత జరుగుతున్నా వాళ్ళెందుకు కలుగజేసుకోలేదు?" అంటూ నేనడిగిన ప్రశ్న ప్రశ్నగానే మిగిలింది తప్ప అక్కడ చేరిన ఏ ఒక్కరూ నోరు విప్పి సమాధానం చెప్పలేదు. సరికదా అసలు నా మాటే విననట్టు నటించారు.

✿ ✿ ✿

ఆ రోజు పొద్దున్నే ఎలుగుబంటి పేషెంట్‌కి బ్యాండేజ్ మార్చి ఇంజక్షన్లు, టాబ్లెట్లు ఇచ్చి వస్తూ... వస్తూ.... చిలకన్నతో "మామా ! నువ్వేం జేస్తవో నాకు తెలియదు గాని ఈరోజు మాత్రం మనమా రాళ్ళ మేకల్ని చూసి రావాల్సిందే" అన్నాను.

దాంతో కొద్దిసేపు ఏదో ఆలోచించిన చిలకన్న "పోదాం పా".... అంటూ ఇంట్లోకి నడిచి విల్లంబులు తెచ్చాడు.

గుంపుకు తూర్పు దిక్కుగా కొండవాగుదాటి, ఇంకొంత దూరం నడిచిం తర్వాత ఎదురైన నెమళ్ళ గుట్టెక్కి ఉత్తరంగా చూస్తే అంత దట్టమైన అడవిలో చిత్రంగా కొంతమేర బయలు ప్రదేశం కన్పిస్తుంది. ఆ బయలు ప్రదేశంలో గుట్ట గడ్డితో కప్పిన పెద్ద, పెద్ద కొట్టాలు కన్పిస్తున్నాయి. ఆ కొట్టాల ముందు కొంతమంది మనుషులు అటూ, ఇటూ తిరుగాడుతున్నారు. దృష్టిని ఇంకొంచెం ముందుకు సారిస్తే మరికొందరు మనుషులు అప్పుడప్పుడే ఒక్కో దొడ్లోని మందను ఒక్కో దిక్కు తోలుకుపోతున్నారు. కలలో కూడా నా ఊహకు అందని ఓ కొత్త ప్రపంచం సజీవంగా కన్పించడంతో ఓ విధమైన విజయ గర్వంతో పొంగిపోయాను.

"అగో మామా ! రాళ్ళమేకలంటే అయ్యే" గుస, గుసగా చెప్పాడు చిలకన్న.

"ఔనా ! నేను కూడా అదే అనుకుంటున్నా. అయితే అంతమంది మనుషులున్నారేంటక్కడ?" ప్రశ్నించాను.

"వాళ్ళంతా దొడ్లకాడి జీతగాళ్లు. ఎంత లేదన్న దొడ్డికి ఏడెనిమిదిమందుంటారు. ఆళ్ళంతా సంకురాత్రికి దొడ్లకాడికొస్తే మళ్ళా దసరాకే ఇంటికిబోతరు" వివరించాడు చిలకన్న.

"అదేం?" అడిగాన్నేను.

"అదేందంటే ఏం జెప్పాల? సంకురాత్రి ముందల సీతకట్టుకు ఈనిన మేకపిల్లల్ని ఈ సుట్టు, ముట్టు పదామడ తిరిగి కొనుక్కొచ్చి దొడ్లల్ల దోల్తరు. దొడ్డి ఒక్కింటికి నూరు, నూటేభై పిల్లల్ని కూడేస్తరు.

"తరువాత?"

"తరువాత ఈణ్ణించి సుట్టూ నాలుగామెడ ఎటు జూసినా కొడిశ, పంచోది, ఏపె చెట్లు కాలు బెట్టసందు లేకుంటుంటై. మందలను ఎటుగొట్టాల్నను కుంటె అటు ముందుగాల కొంతమంది బొయ్యి చెట్లకున్న మండనంత చెలిగి కిందబడేస్తరు. ఆ ఎనక మందల్ని మండగొట్టిన తావుకు దోల్తరు. మేకలు మండకాడికి బొయ్యేటప్పుడు ఏరే ఆకులు దింటే ఆటి కడుపుల్ల రాళ్ళు కరిగిపోతాయని ఎక్కడ ఆగకుంట ఒక్కటే గెదుముడు గెదుముతారు" చెప్పాడు చిలకన్న.

"అదిగాదు మామా ! అసలు రాళ్ళు పడ్డమంటే ఏంటి? మనుషుల మూత్రపిండాల్లో రాళ్ళ లెక్క ఏర్పడతాయా ఏంటి?" నా చదువు, నా తెలివీ అక్కడ వీసమెత్తు కూడా పనిచేయవని అర్థమవుతుంటే అడవిలో అడుగుపెట్టిం తరువాత మొట్టమొదటి సారిగా నేను గమనించిన మిలటరీ కటింగ్ చెట్లు కళ్ళ ముందు మెదులుతుంటే ప్రశ్నించాను.

"అదా ! మొన్న నువ్వు వాగు దగ్గెరికి పోయినప్పుడు ఆవలొడ్డున కొంతమంది ఎయ్యో బస్తాలు మోస్కపోతుంటే సూస్తినంటివి గాదూ ? ఆ బస్తాలేం బస్తాలనుకున్నవ్ ? అయ్యన్ని ఎండు తుమ్మకాయబస్తాలు గాదు? ఏసంగిరోజుల్ల ఆ బురాను సాయబు మనుసులు ఊళ్ళ మీదబడి లారీలకు లారీల తుమ్మకాయ కొని ఇల్లందుల నిలవజేస్తరు.

సంకురాత్రికి దొడ్లల్ల మేకపిల్లల్ని తోలిన కాన్నుంచి వాటికి తిన్నంత తుమ్మకాయ మేపుతరు. ఆ తుమ్మకాయ మేసేటప్పుడు మేకపిల్లలన్ని తుమ్మకాయను సప్ప, సప్ప నమిలి మింగుతై. ఐటెంక తీరుబడిగ పన్నంక నిమ్మలంగ నెమరు బెడతై. అగో అప్పుడు నూటికి తొంభై తొమ్మిది గింజల్ని బైటికి ఎల్లగాస్తే ఏ ఒకటో, అరో గింజ వాటి బోరిగలల్ల ఉండే ఓ తిత్తిల బడిపోతై. అగో అట్ల ఆ తిత్తిల్ల బడ్డ గింజలు అరిగిపోకుంట అట్లనే ఉంటై.

ఇగ ఆ మేకలకు మేపే కొడిశ, పంచోది, ఏపె ఆకుల రసాయనమంత ఆ గింజలకు బట్టి రంగురాళ్ళ మాదిరిగా ఏర్పడతై". సుశిక్షుతుడైన ఓ ఉపాధ్యాయుడు తను పిల్లలకు చెబుతున్న పాఠం సంపూర్ణంగా అర్ధమయ్యేటట్టుఒక్కో విషయాన్ని ఎంత కూలంకుషంగా వివరిస్తాడో అంత కూలంకుషంగా వివరించసాగాడు చిలకన్న.

"ఆ రాళ్ళను ఒక్కసారిచూస్తే బావుండు" మనసులోని కోరికను బైట పెట్టాను.

"దాందేముంది సూడు" అంటూ ఆశ్చర్యంగా తన నడుము చెంగులో దోపుకున్న చిన్న మూటను బైటికి తీసి విప్పి చూపించాడు చిలకన్న. "అదేంటి !?ఆ రంగురాళ్ళు నీదగ్గర కూడా ఉన్నాయని మాటవరుసక్కూడా చెప్పలేదేం?"అంటూ ఉద్విగ్నంగా తొంగిచూసిన నేను నిజంగానే అబ్బుర పడ్డాను. ఆ రాళ్ళను చూస్తే చిన్నపిల్లలు చప్పరించే రంగు, రంగుల చాక్‌లెట్లే కళ్ళముందు మెదిలాయి. దాంతో ఈ రాళ్ళకీ రంగులెట్లా వచ్చాయి? అంటూ అడిగాను కుతూహలాన్ని ఆపుకోలేకపోతూ....

"సెపుతా ఇను మామా ! మేకలకు మేపే ఆ మూడు రకాల ఆకుల్లో కొన్నికొన్ని మేకలకు ఒక్కో రకం ఆకును ఎక్కువగా మేపుతరు. అట్లా మేపటం వల్ల ఆ ఆకుకున్న రసాయనం లోపటున్న గింజలమీద బాగా పేరుకొని ఒక్కో రంగు ఏర్పడుద్ది" సుదీర్ఘంగా వివరించాడు చిలకన్న.

"వాళ్ళ పరిశీలనకు, అనుభవానికి నిజంగా జోహార్లు చెప్పాల్సిందే" అనుకున్న నేను "మరా రాళ్ళను ఎప్పుడు బైటికి తీస్తారు ?" అంటూ మరో ప్రశ్నను సంధించాను.

"సంకురాత్రికి మేకపిల్లల్ని కొని దొడ్లల్ల దోలితే. దసరాకల్ల రాళ్ళ పంట తయారైద్ది. రాళ్ళు తయారైంది లేంది తెలుసుకుందికి మేకల అన్నం డొక్కల పైన మట్టచెయ్యితోని కొట్టి సూస్తే గలగలమని రాళ్ళ సప్పుడు బైటికి ఇన్పిస్తది.

ఇగప్పుడు మేకల్ని లారీల్లకెక్కిచ్చి టౌన్లల కటిక దుకాన్లకు తోలిస్తరు. ఆ కటికోల్లకు, ఈ మేకలోల్లకు ఎప్పట్నుంచో లెక్కలుంటై. ఈ మేకలు మార్కెట్లకొచ్చినయంటె సాలు, కటికోల్లకు కండ్ల పంట. ఎందుకంటె? ఎంత పెద్దమేకనైన గుత్తలెక్కన ఐదొందలకె ఇస్తరు గాబట్టి.

తలకాయలు తప్పిచ్చినంక శాల్తీల లెక్కెమ్మటి రాళ్ళ బుడ్డల్ని దెచ్చి బురాను సాయిబోల్లకు అప్పజెప్తె సాలు. మిగిలినమాంసం కిలోల్లెక్క అమ్ముకొని బొచ్చెడు పైసలు కళ్ళజూస్తరు కటికోల్లంత". ఎడమ చేతిలోని విల్లును కుడిచేతిలోకి మార్చుకుంటూ ఒక్కో విషయాన్ని పూస గుచ్చినట్టు వివరించాడు చిలకన్న.

"నువ్వన్నట్టు దసరా నాటికల్లా మేకల్ని అమ్మకుండా అట్లానే ఉంచి ఇంకా మేపుకుంటూ వెళితే మరిన్ని రాళ్ళు ఏర్పడతాయి గదా ?" నా నాగరీక మైన తెలివితేటలను ప్రదర్శిస్తూ ఇంకో అమాయకపు ప్రశ్న వేసాను.

"కాదు మామా ! నువ్వన్నట్టు మేకలనట్లనే ఉంచి మేపుకుంటబోతె కొంతకాలానికి వాటి కడుపుల్ల రాళ్ళు కడుపుల్లనే కరిగిపోతై. అంతగ్గాకుంటె

ఆటి పెంటికలల్ల కలిసి ఎక్కణ్ణో సోట బైటపడి పోతై". ఓ అమాయకుడైన గిరిజనుడు ఈ విషయం మీద ఇంత అనుభవం సంపాదించడమంటే మాటలా !? ప్రకృతిలో తన చుట్టూ జరుగుతున్న ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలిస్తేనే తప్ప ఇది సాధ్యం కాదు.

ఔను, అనుభవాన్ని మించిన విద్య లేదు. ఆ అనుభవానికి మూలం ప్రకృతితో మమేకత్వమే.

✿ ✿ ✿

"చిలకన్న మామా ! ఎవరీసారు !?" గుట్ట దిగి దొడ్ల దగ్గరికి వెళ్ళిన మమ్మలను చుట్టుముడుతూ అనుమానంగా అడిగారు అక్కడున్నవాళ్ళంతా.

"మాకు బాగా కావాల్సినాయినలే. పట్నంల ఏదో డాక్టరు కోర్సు చదువుతుండు. ఈ అడివిల దొరికే ఎయ్యో ఆకులు, ఏర్లు గావాలని వస్తే ఆ పాండవుల గుట్టకు తీసకపోతున్న". అప్పటికప్పుడు సందర్భానికి తగ్గట్టు సమాధానం ఇచ్చిన చిలకన్న సమయస్ఫూర్తికి ఒక్క నిముషంపాటు తెల్లబోయాను.

చిలకన్న మాటలను వాళ్ళు పూర్తిగా విశ్వ సించడం లేదన్నది వాళ్ళ కళ్ళల్లో లీలగా కన్పిస్తుంటే మళ్ళీ ఏదన్నా అడుగుతారన్న ఉద్దేశ్యంతో కాబోలు చిలకన్న నా చెయ్యి పట్టి గుంజుతూ గబగబా ముందుకు దారితీశాడు.

"ఎందుకు మామ ! వాళ్ళు మననంత అనుమానంగా చూస్తున్నారు ?" చిలకన్న వెనుక నడుస్తూనే అడిగాను.

"ఈడ కొత్తోళ్ళనెవ్వరినీ నమ్మరు మామా !" చెప్పాడు చిలకన్న.

"వీళ్ళ లోకంలో వీళ్ళు అజేయులు" అను కుంటూ చిలకన్న వెనుక అడవిలోకి పోతుంటే రాళ్ళమేకల మందలు కొడిశ చెట్ల ఆకులు మేస్తూ కన్పించాయి. వాటిని చూస్తే మన మామూలు మేకల కన్నా బలంగా నున్నగా మెరుస్తున్నాయి. గమ్మత్తుగా ప్రతి మేక కుడి చెవ్వూరకరకాల పద్ధతుల్లో కత్తిరించి ఉంది ! అదేంటని ప్రశ్నిస్తే కత్తిరింపును బట్టి అది ఏ దొడ్డి మేకో తెల్సిపోతుందని చెప్పాడు చిలకన్న.

వాళ్ళ ఏర్పాట్లకు దంగైపోతూ అట్లాగే ఇంకొంచం ముందుకు వెళ్ళిం తర్వాత మాకో పెద్ద పరుపు బండ ఎదురయ్యింది. చిత్రంగా ఆ బండమీద వాడి పడేసిన సిరంజులు, టేబుల్స్ లేని ఏవో ఖాళీ మందుల సీసాలు కనిపించాయి.

నా ఆశ్చర్యాన్ని గమనించిన చిలకన్న "ఆ తిత్తుల్ల రాళ్ళు పెరుగుతాంటే మేకలకు తీపులు, నొప్పులు తెల్వకుంట ఏసే సూది మందు బుడ్లను యాడకొంటరో గాని ఆటి ఊరూ, పేరూ తెల్వకుంట బుడ్లమీది కాయితాలను ఆణ్ణే చింపి తెస్తరు" అంటూ వివరించాడు.

"నిజంగా ఆ బురాన్ సాహెబ్ ఎవరో గాని అతని ముందు చూపుకు సలాం చెయ్యాల్సిందే" అనుకుంటూ అక్కడున్న సీసాలన్నీ వెతగ్గా, వెతగ్గా ఓ సీసాలో అడుగునెక్కడో కొద్దిగా మిగిలి ఉన్న మందు కన్పించడంతో దాన్ని తీసి జాగ్రత్తగా జేబులో పెట్టు కున్నాను.

ఆ పరుపు బండను దాటి మరికొంత ముందుకు వెళ్ళేసరికి పేరు తెలియని ఏదో అడవి వృక్షం మొదట్లో గుండెలు జారిపోయేంత భయంకర మైన శిలావిగ్రహమొకటి కన్పించింది. ఆ విగ్రహం చుట్టూ కుప్పలు, తెప్పలుగా పడి ఉన్న ఎముకలు, కుండ పెంకులు ఎండి రాలిపోయిన అడవిపూల దండలు, విగ్రహం మీద పాయలు, పాయలుగా చారికలు కట్టి ఎండిపోయిన పసుపు - కుంకుమలు, రక్తపు చారికలు.

అదిరిపాటుతో నిలబడిపోయిన నా వీపు మీద ఎడమచేత చరుస్తూ "ఏంది మామా ! భయ పడ్డవా?" అన్నాడు చిలకన్న చిరునవ్వుతో.

"ఔను ! నిజంగానే భయపడ్డాను. ఇంతకూ ఇదేం విగ్రహం ? ఇంత భయంకరంగా ఉందేంటి?" నాలో భయం స్థానంలో మళ్ళీ ఉత్సుకత చోటు చేసుకుంటుంటే మెల్లగా ప్రశ్నించాను.

"మామా ! పాండవుల గుట్ట ఈన్నించే మొదలైతది. గుట్ట మొగదల్నే ఉన్న ఈ ఇగ్రం బకాసూరునిది. పాండవులు వౌనవాసమొచ్చినప్పుడు బీముడు బకాసూరున్ని సంపింది ఈన్నే. ఆ గుర్తుగ ఈ ఇగ్రెన్ని అప్పటోళ్ళు ఈడ నిలిపిండంట్ర. అగో అప్పట్నుంచి ఇగ్రెం ఈణ్ణే ఉందంట". కల్పనలు, వాస్తవాలు కలగలుపుతూ తమదైన ఆదివాసీ శైలిలో చెప్పుకొచ్చాడు చిలకన్న.

"మరా విగ్రహం చుట్టూ ఎముకలు గుట్టలు, గుట్టలుగా పడి ఉన్నా యేంటి?!" అన్ని ఎముకలు ఏనాడు చూసి ఎరుగని నేను ఆశ్చర్యపోతూ అడిగాను.

"అదా ! దసరా ముందు రాళ్ళమేకల కోత మొదలు పెడతారనగా దొడ్లమీద బలిదిప్పిన అడివి దున్నలను ఈ బకాసూరునికి బలిస్తారు. ఇయ్యన్ని ఆ బొక్కలే" వివరించాడు చిలకన్న.

"అడవి దున్న లను బలిస్తారా?!" నాలో అంతంతకూ పెరిగి పోతున్న ఆశ్చర్యంతో అన్నాను.

నా ఆశ్చర్యాన్ని గమనించిన చిలకన్న ముఖం మరింత గంభీరంగా మార్చివేస్తూ "అప్పుడప్పుడు నరబలి గూడ ఇస్తరు" గుసగుసగా చెప్పాడు.

ఆ మాటలు నా చెవుల్లో ఫిరంగి దెబ్బల్లా మోగుతుంటే "ఇవి రాళ్ళమేకలు కావు, రాక్షసమేకలు. రాళ్ళమేకలను ఈ గిరిజనులకు పరిచయం చేసి మా తాతగారు ఓ రకంగా తప్పు చేశారేమో? అసలీ రాళ్ళమేకల రంగురాళ్ళ ఆఖరి మజిలీ ఎక్కడ ? ఎవరికి చేరుతాయి? వాటితో తయారయ్యే ఆ మందులేమిటి? ఏ రోగాలకు వాడతారు? ఈ నరబలులేమిటి? ఈ అడవుల్లో విస్తరించిన మాఫియాల ఆట కట్టించేదెవరు ?

ఏ ఉద్దేశ్యంతో ఐతే రాళ్ళమేకలు ఇక్కడికి తేబడ్డాయో, ఆ లక్ష్యం ఏనాడో దూరమయ్యింది. మాఫియాల పరమైన రాళ్ళమేకల పెంపకాన్ని మళ్ళీ గిరిజనుల పరమయ్యేలా చూడాలంటే నేనేం చెయ్యాలి? ఎలా చెయ్యాలి ? ఆ తాతకు మనవడిగా జరిగిన పొరపాటును ఖచ్చితంగా సరిదిద్దాల్సిందే. రాళ్ళమేకల పెంపకం వెనుక గూడు కట్టుకున్న మార్మికతను బట్టబయలు చేయాల్సిందే.

ఏ గిరిజనులైతే మాఫియాల చేతుల్లో విల విల్లాడుతున్నారో ఆ గిరిజనులనే అస్త్రాలుగా సంధించి ఆ మాఫియాల అంతం చూడాలి" నా అంతరాంత రాల్లో ఓ సుదీర్ఘ పోరాటానికి నిర్ణయం జరిగి పోయింది.

"ఔను మామా ! మా అడివిని మాకు కాకుంట చేస్తున్నవాళ్ళ అంతు చూడాల్సిందే. మేం గూడ ఇన్నాళ్ళూ నీ అసుంటి నాయకుని కోసమే ఎదురు సూస్తున్నం" నా మనసులోని మాటలను తన మనసు చెవులతో విన్నట్టే మాట్లాడుతూ ఇల్లంబులను ఒడిసి పట్టుకున్నాడు చిలకన్న.


**సినీతారల ఫోటోలు**

ఈ క్రింది అడ్రస్‌కు రూ. 20/-లు ఎం.ఓ చేయండి. వెంటనే మీ అభిమాన సినీతార కలర్ కార్డుసైజు ఫోటోతో పాటు మిమ్ములనవ్వించే జోకుల పుస్తకం కూడా పొందండి.

వై.కె.మూర్తి
దాసరివారి వీధి, సూర్యారావుపేట,విజయవాడ - 520 002